epaper : tmedia.net.in
GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20
# టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
T MEDIA
మెయిన్ : శుక్రవారం - అక్టోబర్ 06-2023 పేజీలు : 3

### బీఆర్ఎస్‌కు ఎమ్మెల్యే
## రేఖా నాయక్ గుడ్ బై



**టి మీడియా, అక్టోబర్ 5,హైదరాబాద్:**
అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ తీవ్ర అసంతప్తికి గురయ్యారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కు ఆమె గుడ్ బై చెప్పారు. రాజీనామాపై రేపు ప్రకటన చేస్తానని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా పోటీ చేస్తానని ఆమె తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ నేతలతో ఆమె జరిపిన చర్చలు కూడా ఫలితాన్ని ఇవ్వలేదు. మూడు విడతలుగా చర్చలు జరిపినప్పటికీ టికెట్ విషయంలో ఎలాంటి క్లారిటీ రాలేదు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా తన అనుచరులతో చర్చలు జరిపిన రేఖా నాయక్%ా% చివరకు ఇండిపెండెంట్ గా పోటీ చేయాలనే నిర్ణయం తీసుకున్నారు.



## మేలుకో తెలుగోడా

- నారా భువనేశ్వరి బస్సు యాత్ర
- రూట్ మ్యాప్ ఖరారు

**టి మీడియా, అక్టోబర్ 5,అమరావతి :**
తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆయన సతీమణి నారా భువనేశ్వరి మరో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ నారా భువనేశ్వరి రాజమండ్రిలో నిరాహార దీక్ష చేపట్టిన విశషయం తెలిసిందే. అయితే, నిరాహార దీక్షలు కాకుండా ప్రజా క్షేత్రంలోనే తేల్చుకునేందుకు రెడీ అవుతున్నట్లుగా సమాచారం. ఇక తన తొలి అడుగును కుప్పం నుంచే మొదలు పెట్టనున్నట్లుగా తెలుస్తోంది. కుప్పం నుంచి 'మేలుకో తెలుగోడా' బస్సు యాత్ర చేసే ఆలోచనలో నారా భువనేశ్వరి ఉన్నట్లు సమాచారం. బస్సుయాత్ర ప్రారంభించవచ్చన్న వార్తల నేపథ్యంలో.. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం ఆధ్వర్యంలో యాత్ర రూట్‌మ్యాప్‌ను బుధవారం పరిశీలించారు. కుప్పం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు టీడీపీ నేతలు. ఆ వివరాలను టీడీపీ అధిష్ఠానానికి పంపించారు. కుప్పం ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగసభ నిర్వహించాలని యోచిస్తున్నట్లుగా సమాచారం. అయితే, బస్సుయాత్ర తేదీ ఇంకా నిర్ణయం కాలేదు.చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఏపీ, తెలంగాణ, ఢిల్లీలో దీక్షలు చేసింది తెలుగు దేశం పార్టీ శ్రేణులు. రాజమహేంద్రవరంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేసిన ఒక్కరోజు నిరాహర దీక్షకు పార్టీ క్యాడర్ భారీ ఎత్తున మద్దతు పలికారు. ఏపీలో పలు చోట్ల వినూత్న రితీలో పార్టీ శ్రేణులు దీక్షలు చేశారు. అయితే, ఆ తర్వాత పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. నారా లోకేష్ ఢిల్లీలో ఉండటంతో.. నారా భువనేశ్వరి, నారా వారి కోడలు, బాల కష్ణ కూతురు బ్రాహ్మణి రాజమహేంద్రవరంలోనే ఉంటున్నారు.అంతేకాదు పార్టీ శ్రేణులు చేస్తున్న దీక్షలకు సంఘీభావం తెలుపుతున్నారు. అక్కడే ఉంటూ పార్టీ కేడర్‌కు మార్గనిర్దేశం చేస్తున్నట్లుగా సమాచారం.

మిగతా 2లో....

# సింగరేణి కార్మికులకు
# దసరా కానుక



### రూ.711.18 కోట్ల లాభాల బోనస్

- సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.శ్రీధర్

**టి మీడియా, అక్టోబర్ 5,హైదరాబాద్:**
సింగరేణి కార్మికులకు దసరా కానుకగా లాభాల వాటా బోనస్ రూ.711.18 కోట్లను ఈనెల 16వ తేదీన చెల్లించనున్నట్లు సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించిన విధంగా గత ఏడాది సింగరేణి సాధించిన రూ.2222.46 కోట్ల రూపాయలలో 32 శాతం లాభాల బోనస్ ను దసరా పండుగకు వారం రోజుల ముందే చెల్లిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సగటున ఒక్కో ఉద్యోగికి రూ.ఒక లక్ష 53 వేల రూపాయల వరకు లాభాల బోనస్ అందనుందని ఆయన తెలిపారు. సింగరేణి సంస్థను లాభాల దిశగా నడిపిస్తున్న కార్మికులకు గతంలో కన్నా ఎక్కువ శాతాన్ని లాభాల వాటా ప్రకటించిన రాష్ట్ర ముఖ్య మంత్రి కె.చంద్ర శేఖరరావుకు సింగరేణి ఉద్యోగుల తరఫున ఛైర్మన్ తన కతజ్ఞతలు తెలిపారు. బోనస్ చెల్లింపుపై డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ పర్సనల్ ఎన్.బలరామ్ గురువారం సర్క్యులర్ ను జారీ చేశారు.వివరాలు ఇలా ఉన్నాయి%ా%దేశంలో మరే ఇతర బొగ్గు కంపెనీలో లేని విధంగా సింగరేణి సంస్థ ప్రతి ఏడాది తనకు వచ్చిన నికర లాభాల్లో కొంత శాతం వాటాను లాభాల బోనస్ గా కార్మికులకు పంచడం జరుగుతుంది. కాగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు గతంలో కన్నా ఎక్కువ శాతం లాభాల వాటా బోనస్ ను ప్రకటిస్తూ వస్తున్నారు. తెలంగాణ రాకపూర్వం 2013 -14లో ఇది 20 శాతం ఉండగా, తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి దీనిని పెంచుతూ 2014-15 లో 21 శాతం, 2015-16లో 23 శాతం (245.21 కోట్లు) 2016-17లో 25 శాతం (98.85 కోట్లు), 2017-18 లో27 శాతం (327.44 కోట్లు), 2018 19 లో 28 శాతం (493.82 కోట్లు), 2020-21 లో29 శాతం (79.07 కోట్లు), 2021-22లో 30 శాతం (368.11 కోట్లు) ప్రకటించారు. గత ఆర్థిక సంవత్సరం అనగా 2022-23 సింగరేణి సంస్థ సాధించిన నికర లాభాలు 2222 కోట్ల రూపాయలలో 32 శాతం అనగా రూ.711.18 కోట్ల ను లాభాల బోనస్ గా కార్మికులకు చెల్లించాలని ఇటీవలే ఆదేశించారు.అలాగే దసరా పండుగకు ముందే ఇది కార్మికుల చేతికి అందేలా చూడాలని ఇటీవల యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం పూర్తి ఏర్పాట్లను చేసింది.ఎక్కువ హాజరు ఉన్నవారికి ఎక్కువ లాభంగత ఆర్థిక సంవత్సరంలో విధులు నిర్వహించిన 46,326 మంది సింగరేణి ఉద్యోగులకు 32 శాతం వాటాగా కేటాయించిన రూ.711.18 కోట్ల రూపాయలను వారు పనిచేస్తున్న గని, శాఖ ఆధారంగా లాభాల బోనస్ ను లెక్కించి చెల్లించనున్నారు. ప్రధానంగా ఎక్కువ హాజరు ఉన్నవారికి ఎక్కువ మొత్తంలో లాభాల బోనస్ దక్కనుంది. భూగర్భ గని ఉద్యోగులకు రోజుకు 749.58 రూపాయల చొప్పున వారు పని చేసిన మొత్తం



దినాలకు లెక్కగట్టి లాభాల బోనస్ చెల్లిస్తారు. ఓపెన్ కాస్ట్ గనులు, ఇతర సర్ఫేస్ శాఖల్లో పనిచేసే వారికి రూ.627.41 చొప్పున చెల్లిస్తారు. వీరు కాక మిగిలిన విభాగాలు, శాఖల్లో పనిచేసే వారికి రోజుకు రూ.578.69 ల చొప్పున వారు పనిచేసిన దినాలకు లెక్క కట్టి బోనస్ చెల్లిస్తారు. మొత్తం మీద చూస్తే సగటున ఒక్కో కార్మికునికి రూ 1,53,516 వరకు లాభాల బోనస్ పొందే అవకాశం ఉంది.తెలంగాణ వచ్చాకనే అత్యధిక టర్నోవర్, లాభాలు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు అందిస్తున్న సహకారం, రాష్ట్ర ముఖ్యమంత్రి దిశా నిర్దేశంలో సింగరేణి సంస్థ గత తొమ్మిదేళ్ల కాలంలో అద్భుతమైన ప్రగతిని సాధించింది. సంస్థ ఛైర్మెన్ అండ్ ఎండి ఎన్.శ్రీధర్ సమర్థ సారథ్యం, ఉద్యోగుల సమష్టి కషి ఫలితంగా తెలంగాణ రాకపూర్వంతో పోలిస్తే లాభాల్లో 421 శాతం వద్ధిని, అమ్మకాలలో 176శాతం వద్ధిని సాధించింది. తెలంగాణ రాకపూర్వం 2013-14 లో రూ.11,928 కోట్ల టర్నోవర్ సాధించిన సింగరేణి, గత తొమ్మిదేళ్లలో ప్రతి ఏటా వద్ధి చెందుతూ 2022-23లో రూ.33,065 కోట్ల రూపాయల టర్నోవర్ కు ఎదిగింది. అలాగే నాడు రూ.419 కోట్ల లాభాలను సాధించిన సంస్థ నేడు రూ.2222 కోట్ల రూపాయల లాభాలను ఆర్జించగలిగింది. త్వరలో దీపావళి బోనస్ కూడాఇదిలా ఉంటే దీపావళి బోనస్ గా పేర్కొనే (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్ బోనస్ ను) కూడా ఆ పండుగకు ముందే చెల్లించనున్నట్లు ఛైర్మన్ అండ్ ఎండి ఎన్.శ్రీధర్ ప్రకటించారు. ఇది కూడా సుమారు 300 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. సగటున ఒక్కో కార్మికుడికి గత ఏడాది చెల్లించిన 76,500 కన్నా ఇంకా ఎక్కువ పొందే అవకాశాలు ఉన్నాయి. ఇటీవలనే చెల్లించిన 11వ వేజ్ బోర్డు ఎరియర్స్ 1450 కోట్ల రూపాయలలో సగటున ఒక్కో కార్మికునికి 3.65 లక్ష రూపాయల వరకు అందాయి.

ఈ విధంగా వేజ్ బోర్డు ఎరియర్స్, లాభాల బోనస్, దీపావళి బోనస్ లు కలిపితే సగటున ప్రతి కార్మికుడి ఖాతాలో దాదాపు 6 లక్షల రూపాయల వరకు జమ అయ్యే అవకాశం ఉంది.ఒక ఏడాదిలో ఇంత పెద్ద మొత్తంలో తమ కష్టార్జితం చేతికందడం ఇదే ప్రథమం కనుక దీనిని వథాచేసుకోకుండా భవిష్యత్తు అవసరాలకు దాచుకోవాలని, సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

ఈ ఏడాది లక్ష్యాలు సాధిస్తే రూ.3500 కోట్ల లాభాలు సి అండ్ ఎండి ఎన్.శ్రీధర్ బాగా పనిచేసిన కారణంగానే అద్భుతమైన వద్ధి సాధ్యమైందని, కనుకనే సింగరేణి చరిత్రలో అత్యధిక శాతం లాభాల వాటాను కార్మికులు అందుకోగలిగారని సంస్థ ఛైర్మెన్, ఎండి ఎన్.శ్రీధర్ పేర్కొన్నారు.

ఈ ఏడాదికి నిర్దేశించుకున్న వార్షిక ఉత్పత్తి లక్ష్యం 720లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణాను సాధించగలిగితే సింగరేణి సంస్థ గత ఏడాది కన్నా మిన్నగా 3500 కోట్ల లాభాలను సాధించే అవకాశం ఉందని, ఫలితంగా మరింత సంక్షేమంతో పాటు. ఇప్పటి కన్నా ఎక్కువ లాభాల వాటా బోనస్ ను పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కనుక ప్రతి కార్మికుడు తన పనిగంటలను, యంత్రాల పనిగంటలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ఉత్పాదకత, ఉత్పత్తి పెంచాలని ఆయన పిలుపునిచ్చారు.

## వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లకు 1200 మందితో బందోబస్తు,

- బ్లాక్ టికెట్స్ పై స్పెషల్ ఫోకస్
- మీడియాతో సీపీ చౌహాన్



**టి మీడియా, అక్టోబర్ 5,హైదరాబాద్:**
ఉప్పల్ స్టేడియం..హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియంలో మొత్తం మూడు మ్యాచ్ లు జరుగున్నాయి.ఇందులో రెండు మ్యాచ్ లు పాకిస్థాన్ జట్టు ఆడేవే ఉన్నాయి. హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో అక్టోబర్ 6, 9, 10తేదీల్లో వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ లు జరుగనున్నాయి.

మిగతా 2లో....

## కాన్వే, రచిన్ మెరుపు శతకాలు

- ఇంగ్లండ్‌పై అఖండ విజయం



**టీ మీడియా, అక్టోబర్ 5,అహ్మదాబాద్ :**
వన్డే వరల్డ్‌కప్ ఆరంభ పోరులో న్యూజిలాండ్ గ్రాండ్ విక్టరీ అందుకుంది. అహ్మదాబాద్ వేదికగా గురువారం ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కివీస్ బ్యాటర్లు డెవిన్ కాన్వే (140), రచిన్ రవీంద్ర (117 ) మెరుపు శతకాలతో విధ్వంసం సష్టించారు. ఇంగ్లండ్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఇద్దరే అవలీలగా ఛేదించారు. 9 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌కు భారీ విజయాన్ని అందించారు.

మిగతా 2లో....

## ఆచరణ సాధ్యం కాని కాంగ్రెస్ హామీలు

### బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్



**టి మీడియా, అక్టోబర్ 5,షాద్‌నగర్:**
అధికారం ఇచ్చినపుడు ప్రజలకు ఏమీ చేయని కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలు ఇస్తోందని బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ విమర్శించారు. హామీలతో ప్రలోభపెట్టాలని ఆ పార్టీ చూస్తోందని ఆరోపించారు. మోసాన్ని మోసంతోనే జయించి.. ఓటు బిఆర్ఎస్ అభ్యర్థులకు వేయాలని కోరారు.

మిగతా 2లో....

## తెలంగాణాలో మొత్తం ఓటర్ల సంఖ్య 3.17 కోట్లు

## 22 లక్షల ఓట్లను తొలగించా

- 80 ఏళ్ళు దాటిన వారికి ఇంటి నుంచే ఓటు
- సీఈసీ రాజీవ్ కుమార్




**టి మీడియా, అక్టోబర్ 5, హైదరాబాద్:**
తెలంగాణాలో మొత్తం ఓటర్ల సంఖ్య 3.17 కోట్లు అని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. తెలంగాణలో స్త్రీ, పురుష ఓటర్లు దాదాపుగా సమానంగా ఉండటం శుభపరిణామం అన్నారు. తెలంగాణలో మూడు రోజుల పాటు సీఈసీ బందం పర్యటన ముగిసింది. రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి.. మొత్తం 119 నియోజకవర్గాల్లో సంసిద్ధతపై కమిషన్ సమీక్ష నిర్వహించింది. ఈ క్రమంలో సీఈసీ రాజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించామని.. ఏకపక్షంగా ఓట్లు తొలగించామని అనడం సరికాదని సీఈసీ రాజీవ్ కుమార్ అన్నారు. రాష్ట్రంలో 2022-23లో 22 లక్షల ఓట్లను తొలగించామని చెప్పారు. ఫామ్ అందిన తర్వాతనే ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించామని చెప్పారు. తెలంగాణలో కొత్తగా 8.11 లక్షల యువ ఓటర్ల నమోదు చేసుకున్నారని తెలిపారు. జూలై తర్వాత దరఖాస్తు చేసుకున్న 2.21 లక్షల మంది యువతకు ఓటు హక్కు కల్పించామని చెప్పారు. తెలంగాణలో తొలిసారిగా.. 80 ఏళ్ళు దాటిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఫామ్ 12డీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఫిర్యాదుల కోసం సీ విజిల్ యాప్‌ను తీసుకొచ్చామని.. ఏదైనా ఫోటో పెడితే 100 నిమిషాల్లో చర్యలు ఉంటాయని తెలిపారు.



## స్టేట్‌మెంట్ మినహా సాక్ష్యాధారాలేవీ

- మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై సుప్రీం

**టీ మీడియా, అక్టోబర్ 5, న్యూఢిల్లీ :**
ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన నిందితుడు దినేష్ అరోరా స్టేట్‌మెంట్ మినహా సిసోడియాకు వ్యతిరేకంగా సాక్ష్యాలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించింది. నగదు ఎవరి నుండి ఎవరికి ఎలా చేరిందనే అంశంపై పూర్తి సాక్ష్యాధారాల లింకులను సమర్పించలేదని పేర్కొంది. లిక్కర్ గ్రూపుల నుండి మనీస్ సిసోడియాకు ముడుపులు అందాయని దర్యాప్తు సంస్థ పేర్కొందని, అయితే ఆ నగదు ఎలా చేరిందని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టితో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది.మీరు రూ.100 కోట్లు, రూ.30 కోట్లు అని రెండు అంకెలు చెప్పారు. వారికి ఇది ఎవరు చెల్లించారు. నగదు చాలా మంది చెల్లించవచ్చు. మద్యానికి సంబంధించినదే కానవసరంలేదు. సాక్ష్యం ఎక్కడ ఉంది.

దినేష్ అరోరా కూడా నగదు తీసుకున్న వ్యక్తే. గ్రహీత. ఒక్క దినేష్ అరోరా ప్రకటన తప్ప.. ఈ కేసులో సరైన రుజువులు ఏవి " అని జస్టిస్ ఖన్నా ప్రశ్నించారు. ఈ కేసులో విజయ్ నాయర్ మాత్రమే ఉన్నారని, మనీష్ సిసోడి యా పాత్ర లేదని ధర్మాసనం ప్రశ్నించింది. మనీలాండరింగ్ చట్టం కింద సిసోడియాను ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించింది. అప్రూవర్‌గా మారిన ఓ వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలాన్ని సాక్ష్యంగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. ఈ కేసులో సిసోదియాకు వ్యతిరేకంగా సరైనా ఆధారాలను చూపించలేకపోయారని కోర్టు స్పష్టం చేసింది. అయితే ఈ కేసులో నిందితుడిగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్ ) పేరును చేర్చేందుకు ఈడి కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిపై న్యాయసలహాలు కూడా తీసుకుంటున్నాయని సమాచారం. న్యాయవాదుల నుండి అభిప్రాయాలను సేకరించిన తర్వాత ఈడి ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోనుందని ఆ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో మనీష్ సిసోడియా కేసులో పూర్తి సాక్ష్యాధారాలు సమర్పించలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించడం గమనార్హం.

## వెనుకబడిన తరగతుల గణన నిర్వహించాలి

- కాంగ్రెస్‌ధ్యక్షుడు మల్లికార్జున ఖార్గె

**టీ మీడియా, అక్టోబర్ 5,న్యూఢిల్లీ :**



వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవడానికి వెనుకబడిన తరగతుల గణన జరగాలని కాంగ్రెస్ కోరుకుంటోందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గె తెలిపారు. కుల గణన నిర్వహించినట్లైతే వారి స్థితిగతులకు సంబంధించిన కచ్చితమైన వివరాలు తెలుస్తాయని, అప్పుడు వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవడం సులభమవుతుందని చెప్పారు. దేశాన్ని విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించడాన్ని ఆయన విమర్శించారు. దేశ ప్రజలకు చైతన్యవంతులుగా మారారని, ఇక 2024లో మోడీ ఆటలు సాగవని అన్నారు. రారుఘడ్ జిల్లాలో కొంద్‌తరారు గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు మహిళా వ్యతిరేక సిద్ధాంతాలను కలిగివున్నాయని విమర్శించారు. మహిళలు, వెనుకబడిన తరగతులు, నిరుపేదల గురించి బిజెపి నిజంగా ఆందోళన చెందుతున్నట్లైతే ఇప్పుడే మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలన్నారు. మహిళలు ముందుకు రావాలని ఆ పార్టీ కోరుకోవడం లేదన్నారు. వెనుకబడిన తరగతుల కుల గణన జరిగితే ఎంతమంది వెనుకబడ్డారు, వారిలో ఎంతమంది అక్షరాస్యులు, ఎంతమంది ఆర్థికంగా వెనుకుబడ్డారు వంటి వివరాలు తెలుస్తాయన్నారు. అప్పుడు వారి ప్రయోజనాల కోసం చర్యలు తీసుకోవడానికి వీలు వుంటుందన్నారు. అందుకే నిరుపేదల, వెనుకబడిన వర్గాల గణన జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబం మృతి ఘటనలో సంచలన విషయాలు..

• రెండో భార్య మాటలు విని చంపేశాడా?

**టీ మీడియా, అక్టోబర్ 5,కడప :**

కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబం మొత్తం చనిపోవడంపై అతని వదిన సువర్ణలత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు చనిపోయినా తనకు అభ్యంతరం లేదు కానీ, పిల్లలను చంపడమే బాధాకరం అన్నారు. కానిస్టేబుల్ కుటుంబం మృతి ఘటనలో సంచలన విషయాలు.. రెండో భార్య మాటలు విని మొదటి భార్య, ఇద్దరు పిల్లలను చంపేశాడా? ఏపీలోని కడపలో కానిస్టేబుల్ కుటుంబం మొత్తం చనిపోవడం తీవ్ర విషాదం నింపింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురూ మృతి చెందడం అందరి హృదయాలను కలిచివేస్తోంది. కుటుంబం మొత్తం మరణించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య, ఇద్దరు పిల్లలను చంపి కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబ మొత్తం చనిపోవడానికి కారణమేంటీ? అసలు వెంకటేశ్వర్లు ఎందుకు ఇంత దారుణానికి ఒడిగట్టాడు?ఎందుకు భార్య, ఇద్దరు పిల్లలను చంపాడు? కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబం మతికి రెండో పెళ్లే కారణమా? రెండో భార్య



మాటలు విని మొదటి భార్య, ఇద్దరు పిల్లలను చంపేశాడా? ఇద్దరు భార్యల మధ్య జీవితాన్ని కొనసాగించలేకనే భార్యా పిల్లలను చంపి తానూ తనువు చాలించారా? మరీ మరణవాంగ్మూలం రాసుకుని ఘాతుకానికి పాల్పడ్డారు. భార్య, ఇద్దరు పిల్లలను చంపి తానూ ప్రాణాలు తీసుకోవడానికి గల బలమైన కారణాలేంటనేదీ చర్చనీయాంశంగా మారింది.ఈ కేసులో పోలీసుల ప్రాథమిక విచారణలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు రెండో భార్య సూచనల మేరకే భార్య మాధవితో పాటు ఇద్దరు కూతుర్లను హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో రెండో భార్యకు తాను చనిపోతున్నట్లు వెంకటేశ్వర్లు మెసేజ్ పెట్టారు. రెండో భార్యకు మెసేజ్ పెట్టిన తర్వాత వెంకటేశ్వర్లు తొలుత మొదటి భార్య, ఇద్దరు పిల్లలను నుదుటిపై కాల్చి చంపారు.కుటుంబ సభ్యులను చంపిన అనంతరం కుడి కనతపై కాల్చుకొని వెంకటేశ్వర్లు ఆత్మహత్య చేసుకున్నారు. తన మరణానంతరం తనకు వచ్చే డబ్బు, తన రెండో భార్యకు, ఉద్యోగం రెండో భార్య కొడుకుకు చెందాలని వెంకటేశ్వర్లు ముందుగానే మరణ వాంగ్మూలం రాసుకున్నారు. ఈ మేరకు వెంకటేశ్వర్లు 2023జూన్ 26న బాండు పేపర్లు కొనుగోలు చేశారు. మరణ వాంగ్మూలం రాసిన పేపర్లను కూడా ఆరోజే కొనుగోలు చేశారు. దీంతో ఇది ప్రీ ప్లాన్డ్ హత్యగా స్థానికులు పేర్కొంటున్నారు.

కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబం మొత్తం చనిపోవడంపై అతని వదిన సువర్ణలత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు చనిపోయినా తనకు అభ్యంతరం లేదు కానీ, పిల్లలను చంపడమే బాధాకరం అన్నారు. ఏనాడు తన చెల్లెలు తన మరిది (వెంకటేశ్వర్లు) గొడవ పడిన దాఖలాలు లేవన్నారు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో తమకు తెలియదన్నారు. పిల్లలను కాల్చి చంపడం చాలా దారుణమని వాపోయారు .రెండో పెళ్లి చేసుకున్నట్లు తమకు తెలియదని పేర్కొన్నారు. పోలీసులు చెప్పే వరకు మరణ వాంగ్మూలం రాశాడని కూడా తమకు తెలియదని వెల్లడించారు. కడపలోని కోపరేటివ్ కాలనీలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు భార్య, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేశ్వర్లు తన భార్య, ఇద్దరు పిల్లలను చంపి తర్వాత తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు.తన తుపాకీతో భార్య, ఇద్దరు పిల్లల నుదిటిపై కాల్చి చంపారు. అనంతరం తానూ అదే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబం ఘటన గురించి స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.



# ముస్లింలకు అండగా కాంగ్రెస్

• ఉత్తమ్ కుమార్ రెడ్డి

**టి మీడియా, అక్టోబర్ 5, హుజూర్ నగర్ :**

హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలోని ఉస్మానియా మస్జీద్ (మర్కజ్)కు ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. మైనారిటీ సోదరులు సాధార స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక దువా చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్థానిక ముస్లిం సోదరులను ఉద్దేశించి మాట్లాడుతూ.. మైనారిటీలకు చెందిన వక్ఫ్ బోర్డ్ ఆస్తులు, దర్గా,ఈద్గా,ఆషుర ఖానా (పీర్ల చావిడి) స్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు తన దష్టికి వచ్చిందని, ఏ స్థాయి నాయకుడైన వక్ఫ్ ఆస్తులను ఆక్రమణ చేస్తే సహించేది లేదని, ఆక్రమణలను ప్రోత్సహించే అధికారులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తీవ్రంగా హెచ్చరించారు. హుజూర్ నగర్ నియోజకవర్గంలో ముస్లింల రక్షణకు మైనారిటీల ఆస్తుల పరిరక్షణకు తానే ముందుంటానని ఈ సందర్భంగా మైనార్టీలకు హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ముస్లింలకు 100% సహాయ సహకారాలు అందించానని, హుజూర్ నగర్ నియోజకవర్గంలోఖబరస్తాన్ లకు,ఆషుర ఖానాలకు, షాదీ ఖానాలకు నిధులు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లకు 1200 మందితో బందోబస్తు

• బ్లాక్ టికెట్స్ పై స్పెషల్ ఫోకస్

• మీడియాతో సీపీ చౌహాన్

ఈ నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మేరకు సీపీ చౌహాన్ మీడియాతో మాట్లాడుతూ ఉప్పల్ స్టేడియం వేదికగా ఇప్పటికే రెండు వార్మప్ మ్యాచ్ లు పూర్తయ్యాయని తెలిపారు. మరో మూడు ప్రధాన మ్యాచ్ లు జరగబోతున్నాయని చెప్పారు.మ్యాచ్ లు సజావుగా జరిగేలా పూర్తి భద్రతా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి గేట్లు ఓపెన్ చేసి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామని చెప్పారు. వార్మప్ మ్యాచ్ లకు ఎలాంటి డైవర్షన్స్ పెట్టలేదు కానీ, మూడు మెయిన్ మ్యాచ్ లకు కొన్ని డైవర్షన్స్ పెడతామని పేర్కొన్నారు. అడుగడుగునా సీసీ కెమెరాల నిఘాలో ఉండేలా ఒక కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 30 మంది సిబ్బంది కెమెరాలను పరిశీలిస్తుంటారని వెల్లడించారు.వరల్డ్ కప్ మ్యాచ్ లకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 1200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజలు ఉత్సాహంగా మ్యాచ్ లు చూడటానికి వస్తారని వెల్లడించారు. ఒక ప్రాపర్ ప్లాన్ ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వారం రోజుల క్రితం హెచ్ సీ ఏ తో మీటింగ్ నిర్వహించామని తెలిపారు. ఐపీఎల్ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామని గుర్తు చేశారు.ఇక్కడికి వచ్చే టీమ్స్ కి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 11 గంటలకు ప్రేక్షకులను గ్రౌండ్ లోకి అనుమతిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మ్యాచ్ స్టార్ట్ అవుతుందన్నారు. పార్కింగ్ విషయంలో స్పెషల్ ప్లాన్ చేశామని వెల్లడించారు. పార్కింగ్ ప్లేసెస్ లో సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ట్రాఫిక్ డైవర్షన్స్ అడ్వైజరీ కూడా ఇష్యూ చేస్తామని చెప్పారు. బయటి నుంచి ఫుడ్ ఐటమ్స్, వాటర్ బాటిల్స్ గ్రౌండ్ లోకి అనుమతి లేదన్నారు.కంట్రోల్ రూమ్ ద్వారా సెక్యూరిటీని మానిటరింగ్ చేస్తామని పేర్కొన్నారు. గ్రౌండ్ కి వచ్చిన ప్రతీ ఒక్కరు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉప్పల్ స్టేడియం కెపాసిటీ 40 వేలు అని తెలిపారు. మ్యాచ్ అయిపోయిన అందరూ ఒకేసారి బయటకి వెళ్లకుండా%ైౌ% మెల్లగా వెళ్లాలని సూచించారు. క్రైమ్ టీమ్స్, షీ టీమ్స్ గ్రౌండ్ లోపల బయట మఫ్టీలో ఉంటారని పేర్కొన్నారు. ప్రేక్షకులకు వాటర్ ఫెసిలిటీ ఏర్పాటు చేయాలని హెచ్ సీ ఏకి సూచించామని తెలిపారు. బ్లాక్ టికెట్స్ అమ్మేవారిపై స్పెషల్ ఫోకస్ పెట్టామని వెల్లడించారు.

# ఆచరణ సాధ్యం కాని కాంగ్రెస్ హామీలు

• బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు."బిజెపి వాళ్లకు అదానీ నుంచి బాగా పైసలు వస్తున్నాయట. కాంగ్రెస్, బిజెపి వాళ్లను దబాయించి పైసలు అడగండి. రైతుబంధు అందితేనే.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు వస్తేనే మాకు ఓటేయండి. తొమ్మిదేళ్లలో ఎన్నో మంచి పనులు చేసుకున్నాం. షాద్‌నగర్‌కు నీళ్లు ఇచ్చేది కేసీఆర్.. తెచ్చేది అంజయ్య యాదవ్. కాంగ్రెసోళ్లు కడుపులో గుద్ది.. నోట్లో పిప్పర్‌మెంట్ పెడతారు. బిజెపి వాళ్లు నీళ్ల వాటా తేల్చరు.. కాంగ్రెస్ వాళ్లు ప్రాజెక్టులపై కేసులేసి ఇబ్బంది పెడతారు. రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అని కాంగ్రెస్ నేతలే చెప్పారు. ఈ విషయంపై పంజాబ్ మాజీ సీఎం కెప్టెన్ అమరీందర్‌సింగ్ సోనియాగాంధీకి లేఖ రాశారు. రేవంత్ బిజెపితో కలిసి పోయారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన వాళ్లు బిజెపిలోకి జంప్ అవుతారు" అని కేటీఆర్ విమర్శించారు.

# మేలుకో తెలుగోడా

• నారా భువనేశ్వరి బస్సు యాత్ర • రూట్ మ్యాప్ ఖరారు

అయితే తాజాగా భువనేశ్వరి కూడా బస్సు యాత్ర ప్రారంభిస్తారనే చర్చ మొదలైంది. ఈ మేరకు పార్టీలో చర్చకు తగినట్లు రూట్ మ్యాప్ కూడా రెడీ అయినట్లుగా తెలుస్తోంది. కోర్టుల్లో వచ్చే నిర్ణయాలకు అనుగూనంగా భువనేశ్వరి బస్సు యాత్రపై ఫైనల్ నిర్ణయం ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు నేతలు.ఇదిలావుంటే, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్, కస్టడీ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు రిమాండ్‌ను మరో 15 రోజులు పొడిగించాలని సీఐడీ మెమో దాఖలు చేసింది. సీఐడీ తరఫున వాదనలు వినిపించిన ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి.. ఈ కేసులో కర్త, కర్మ, క్రియ చంద్రబాబేనని ఆరోపించారు. కేసులో మరింత లోతుగా విచారణ జరగాలంటే కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. స్కిల్ స్కామ్ మొత్తం చంద్రబాబే నడిపించారని..అందువల్ల బెయిల్ ఇవ్వకుండా కస్టడీకిఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

# కాన్వే, రచిన్ మెరుపు శతకాలు

• ఇంగ్లండ్‌పై అఖండ విజయం

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆటగాళ్ల వికెట్లను వరుసగా పడగొడుతూ షాకుల మీద షాకిచ్చింది. దీంతో బెయిర్‌స్టో (33), మలన్ (14), బ్రూక్ (25), అలీ (11), బట్లర్ (43), లివింగ్‌స్టోన్ (20) తక్కువ పరుగులకే ఔట్ చేసి పెవిలియన్‌కు చేరింది. ఈ క్రమంలో కివీస్ బౌలర్లను తట్టుకుని జో రూట్ ( 77) ఒక్కడే నిలబడ్డాడు. హాఫ్ సెంచరీతో మెరిశాడు. రూట్ తర్వాత క్రీజులోకి వచ్చిన క్రిస్ ఓక్స్ ( 11), సామ్ కర్రన్ (14) కూడా కివీస్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. ఫలితంగా నిర్ణీత 50 ఓవర్లు ముగిసేసరికి 282 పరుగులు చేశారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 3, గ్లెన్ ఫిలిప్స్ 2, మిచెల్ శాంటర్న్ 2, ట్రెంట్ బౌల్ట్, రచిన్ రవీంద్ర చెరో వికెట్ తీశారు.

# ఓటు హక్కు నమోదుకు చివరి అవకాశం

• తాసిల్దార్ నాగేశ్వరరావు

**టీ మీడియా, అక్టోబర్ 5, నడిగూడెం :**



ఓటు హక్కు కు నమోదుకు చివరి అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించినట్లు తాసిల్దార్ టీ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అక్టోబరు 1 2023 వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు దర్కాస్తు చేసుకోవాలని కోరారు. నామినేషన్ తేదీ ముగింపు 10 రోజుల ముందు వరకు గడువు ఉన్నదని అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# జల్ జంగిల్ జమీన్ నివురుగప్పిన నిప్పులా ఆదిలాబాద్

• కదం తొక్కిన ఆదివాసీలు..

**టి మీడియా, అక్టోబర్ 5,ఆదిలాబాద్ :**

ఆదివాసీల నిరసనలతో ఆదిలాబాద్ నివురు గప్పిన నిప్పులా మారింది. జల్ జంగిల్ జమీన్ అంటూ ఆదివాసీలు మరోసారి జంగ్ సైరన్ మోగించడం.. తమ భూములకు పట్టాలిప్పించాలంటూ డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుండి ప్రగతి భవన్ కు మహా పాదయాత్ర చేపట్టడం.. ఆ యాత్రను పోలీసులు భగ్నం చేయడం ఇందుకు కారణమైంది. అక్టోబర్ 2 న ఆదిలాబాద్ జిల్లా మావల మండలం కొమురంభీం కాలనీ నుండి మొదలైన మహాపాదయాత్ర నేరడిగొండకు చేరుకోగానే అక్టోబర్ 4 బుదవారం అర్ధరాత్రి పోలీసులు పాదయాత్రను భగ్నం చేయండతో ఆదివాసీలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. శాంతియుతంగా చేస్తున్న పాదయాత్రను భగ్నం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మావల బైపాస్ వద్ద జాతీయ రహదారి 44 పై బైటాయించి ఆందోళనకు దిగారు. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారడంతో భారీగా పోలీసులు మోహరించారు. కొమురంభీం కాలనీ ఆదివాసులకు పట్టాల విషయంలో స్పష్టమైన హామీ వచ్చేంత వరకు ఆందోళన ఆపమంటూ తేల్చి చెప్పారు



తుడుందెబ్బ నేతలుఆదివాసీ హక్కులను కాపాడాలనీ.. అర్హులందరికీ ఇళ్లస్థలాలు, స్థలాలున్న వారికి పట్టాలు ఇవ్వాలనీ డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. శాంతియుతంగా సాగుతున్న మహా పాదయాత్రను నేరడిగొండ వద్ద భగ్నం చేసి ఆదివాసీలను అర్ధరాత్రి నుండి నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ తుడుందెబ్బ నేతలు రోడ్డెక్కారు. పది గంటలుగా 150 మంది ఆదివాసీలను పాదయాత్ర నుండి అరెస్ట్ చేసి ఆదిలాబాద్ కు తరలిస్తామంటూ బస్ లో తీసుకొచ్చి మావల వద్దే నిలిపి వేశారని.. ఎందుకు అరెస్ట్ చేశారో చెప్పకుండా అటు పోలీస్ స్టేషన్ కు సైతం తరలించకుండా నిలిపి వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల అదుపులో ఉన్న ఓ మహిళ అస్వస్థకు గురవడంతో ఒక్కసారిగాకట్టలు తెంచుకున్న ఆగ్రహంతో పక్కనే ఉన్న జాతీయ రహదారిపై బైటాయించి నిరసనకు దిగారు. తమను కలెక్టరేట్ కు తరలించాలని.. లేదంటే ప్రగతి భవన్ కు పాదయాత్రగా వెళ్లేందుకు అనుమతివ్వాలని లేదంటూ ఆందోళనను మరింత ఉదతం చేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు ఆదివాసీలు. ఘటన స్థలానికి చేరుకున్న ఆదిలాబాద్ డీఎస్పీ ఉదయ్ రెడ్డి ఆందోళనకారులకు నచ్చ జెప్పి కలెక్టరేట్ కు తరలించడంతో మహా పాదయాత్ర ఆందోళనకు తాత్కాలికంగా బ్రేక్ పడిందికలెక్టరేట్ తో చర్చించిన తర్వాత సరైన హామీ లభించకపోతే తమ తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని ఆదిలాబాద్ ఆదివాసీ తుడుందెబ్బ అధ్యక్షుడు గెడం గణేష్ తెలిపాడు. కొమురంభీం కాలనీలోని సర్వే నెంబర్ 72 లోని 80 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆదివాసీలకు అందించి.. పట్టాలు ఇవ్వాలని.. గహలక్ష్మి పథకం కింద నిదులు విడుదల చేసి ఆదివాసీలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ ఉద్యమ తీవ్రతను అధికారులు అంచనా వేయలేరని.. జల్ జంగిల్ జమీన్ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం అని తెలిపారు.

# 5శాతం ఐఆర్ ఏకపక్ష నిర్ణయం ఆమోదయోగ్యం కాదు

**టీ మీడియా, అక్టోబర్ 5, పెద్దపల్లి :**

ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా 5% మధ్యంతర భృతి ప్రకటించడం సరైన విధానం కాదు అని, ఆమోదయోగ్యం కూడా కాదు అని ఉపాధ్యాయ పోరాట సంగాల సమితి ఆధ్వర్యంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొట్యాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్ మాట్లాడుతూ... ఇప్పటికే గత పిఆర్సి లో 12 నెలల కాలాన్ని నష్టపోయామని, మిగిలిన బకాయిలను కూడా 18 వాయిదాలలో చెల్లిస్తామని చెప్పి ఇప్పటివరకు కనీసం ఐదు వాయిదాల బకాయిలు కూడా చెల్లించలేదు.గత పిఆర్సి మధ్యంతర భృతి అసలే ప్రకటించ లేదు.ఈసారి ఐదు శాతం మధ్యంతర భృతి పెరిగిన ధరలు ఖర్చులకు ఏమాత్రం సరిపోదు.ఇది పూర్తిగా సత్య దూరం, అశాస్త్రీయమైన విధానం. ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ



ప్రభుత్వం అని చెబుతూనే ఉద్యోగుల పట్ల చిన్న చూపు,నిరంకుశ ధోరణి అవలంబిస్తుంది. దీనివల్ల ఉద్యోగులు ఉపాధ్యాయులు తీవ్రమైన ఆవేదన కలుగుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టిలో ఉంచుకొని తక్షణమే మధ్యంతర భృతిని కనీసం 15 శాతానికి సవరించాలని, ఇప్పటివరకు బకాయి ఉన్న 3 విడతల డిఏ బకాయిలను తక్షణమే ప్రకటించాలని, పెండింగ్ లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానో పాధ్యాయురాలు సంగీత, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె శ్రీనివాస్, ఉపాధ్యాయులు రామస్వామి, జొన్నలు రవీందర్, శంకర్,లక్ష్మయ్య రాజనర్సయ్య, తిరుపతి,శ్రీధర్, రవీందర్ రెడ్డి, ప్రశాంతి, మొదలగు వారు పాల్గొన్నారు.

# గంగపుత్రులకు ఏడవ విడతగా చేప పిల్లల పంపిణీ

**టీ మీడియా, అక్టోబర్ 5, రామకృష్ణాపూర్ :**

క్యాతనపల్లి మున్సిపాలిటీ కురుమపల్లిలోని ఊర చెరువులో తెలంగాణ ప్రభుత్వ మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏడవ విడతగా యాభై ఒక్క వేల చేప పిల్లలను విడుదల చేసిన ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ , స్పోర్ట్స్ చైర్మన్ ఆంజనేయ గౌడులు కలిసి చేప పిల్లల్ని చెరువుల్లో వదిలే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బాల్క సుమన్ మాట్లాడుతూ కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మత్స్య సంపదను పెంచే ఉద్దేశంతో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ముదిరాజులు, బెస్తవాళ్ల యొక్క



జీవనోపాధిని పెంచే లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని చెరువులలో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్ చైర్ పర్సన్ జంగం కళ,వైస్ చైర్ పర్సన్ విద్యాసాగర్ రెడ్డి, పట్టణ ఇంచార్జ్ గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హాకీంపేటలో టీఎస్ఆర్టీసీ ఐటీఐ కొత్త కళాశాల

**టీ మీడియా, అక్టోబర్ 5, హైదరాబాద్ :**

ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులకు శుభవార్త. హైదరాబాద్ శివారు హకీంపేటలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా(టీఎస్ఆర్టీసీ) ఐటీఐ కొత్త కళాశాలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్(డీజీటీ) తాజాగా అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచే కళాశాలను ప్రారంభించి, తరగతులను నిర్వహించాలని సంస్థ నిర్ణయించింది.10వ తరగతి విద్యార్హతతో మోటార్ మెకానిక్ వెహికిల్, మెకానిక్ డీజిల్ ట్రేడ్‌లలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 8వ తేదీలోగా iti.telangana.gov.in వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 9వ తేదీన వాక్ ఇన్ అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. తక్కువ వ్యవధిలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో వరంగల్, హాకీంపేటలో ఐటీఐ కళాశాలలను టీఎస్ఆర్టీసీ ఏర్పాటు చేసింది. గత విద్యా సంవత్సరం నుంచే వరంగల్ ఐటీఐని సంస్థ ప్రారంభించింది. తాజాగా హాకీంపేట ఐటీఐ కళాశాలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్(డీజీటీ) అనుమతి ఇచ్చింది. ఆ కళాశాలలో ఈ ఏడాది నుంచి మోటార్ మెకానిక్ వెహికిల్, మెకానిక్ డీజిల్ ట్రేడ్‌లలో ప్రవేశాలు జరుగుతున్నాయి. ఈ కొత్త కళాశాలలో నిపుణులైన అధ్యాపకులతో పాటు అపార అనుభవం గల ఆర్టీసీ అధికారులచే సంస్థ తరగతులను నిర్వహిస్తుంది. ఈ ట్రేడ్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కోరుకున్న టీఎస్ఆర్టీసీ డిపోల్లో అప్రెంటిషిఫ్ సౌకర్యాన్ని కల్పిస్తాం. నిరుద్యోగ యువతకు చక్కటి శిక్షణ, బంగారు భవిష్యత్‌ను అందించాలనే ఉద్దేశంతో ఈ కళాశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు పూర్తి సమాచారం కోసం 9100664452 ఫోన్ నంబర్ ని సంప్రదించాలి అని టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనర్ సూచించారు.

## ఆర్థిక సహాయం కోసం సిరి ఫౌండేషన్ను ఆశ్రయించిన శాంతయ్య

**టీ మీడియా, అక్టోబర్ 5, రామకృష్ణాపూర్ :**



క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని అమరవాది గ్రామానికి చెందిన మేదరి శాంతయ్య అనే వ్యక్తికి మెడలో బోన్ పెరిగిన కారణంగా కరీంనగర్ లో గల హరిని హాస్పిటల్ లో చేర్పించడం జరిగింది.ఆ పెరిగిన బోన్ ని తొలగించడానికి ఆపరేషన్ చేయాలని ఆపరేషన్ కి అయ్యే ఖర్చు 5 లక్షల రూపాయలు అని వైద్యులు చెప్పారు. మేదరీ శాంతయ్య ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు అతనిది చాలా నిరుపేద కుటుంబం కావున ఆపరేషన్ కి అయ్యే ఖర్చు పెట్టుకునే ఆర్థిక స్తోమత వారి దగ్గర లేనందున వారు ఆర్థిక సహాయం కోసం సిరి ఫౌండేషన్ ని ఆశ్రయించారు.కావున దయచేసి ఆ కుటుంబానికి అండగా నిలవాలనుకునే మనందరం తోచిన సహాయం అందిస్తే ఆ కుటుంబంలో ఉన్న పెద్ద దిక్కును కాపాడిన వాళ్ళము అవుతాం అని, సిరి ఫౌండేషన్ అధ్యక్షులు సరిగమల తిరుపతి, ఉపాధ్యక్షులు కడగండ సాయికుమార్ అన్నారు. దయచేసి సహాయం అందించే సహదుయులు ఈ క్రింది నంబర్‌కు ఫోన్‌పే, గుగుల్‌పే, పేటీఎమ్ చేయగలరు. సరిగమల తిరుపతి 9989576980.

## 199లకే రైతులకు ప్రమాద భీమా

• మేనేజర్ రవి నాయక్

**టి మీడియా, అక్టోబర్ 5, మేళ్ళ చెరువు :**



రైతులకు ఏటా కేవలం199 రూపాయలకే ప్రీమియంలో మూడులక్షల ప్రమాదభీమా కల్పిస్తున్నట్లు స్థానిక గ్రోమోర్ కంపెనీ మేనేజర్ బానోతు రవి నాయక్ తెలిపారు. గురువారం గ్రోమోర్ సేవా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో రైతులకు అవగాహన కల్పించారు. రూ.199లు చెల్లించి రైతులు బాండ్ పేపర్ పొందవచ్చని, పాము కాటు, రోడ్డు ప్రమాదం, విద్యుత్ఘాతానికి, పిడుగు పాటులకు ఈ భీమా వర్తిస్తుందని ఆయన తెలిపారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల పెంచిన వేతనాలు ఇవ్వాలి

**టీ మీడియా, అక్టోబర్ 5, నడిగూడెం :**



మధ్యాహ్న భోజన కార్మికుల పెంచిన వేతనాలు అమలు పరచాలని సిఐటియు మండల కన్వీనర్ మల్లెల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం భోజనం కార్మికుల సమ్మెలో పాల్గొని మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలు చెల్లించాలని కనీస వేతనం 22000 ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిన ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు.ఈనెల తొమ్మిదిన చలో కలెక్టరేట్ ముట్టడికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమా, రహీమా, నాగమ్మ, మణెమ్మ, అంజమ్మ, భద్రమ్మ పాల్గొన్నారు.

## కోచింగ్ ఇప్పించిన పిల్లుట్ల రఘుకు ధన్యవాదాలు

• పోలీస్ ఉద్యోగం సంపాదించిన అభ్యర్థులు

**టి మీడియా, అక్టోబర్ 5, హుజూర్ నగర్ రూరల్ :**



మాకు ఇంత మంచి అవకాశం ఇచ్చి ఫ్రీ కోచింగ్ ఇప్పించి ఈరోజు కానిస్టేబుల్ లాగా మమ్మలిని మా కుటుంబాలకు పరిచయం చేసిన రఘు అన్నకి ప్రత్యేక ధన్యవాదాలని కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారు తెలియజేశారు. హుజూర్ నగర్ నియోజకవర్గం కాకుండా, ప్రక్కనే ఉన్న మిర్యాల గూడ, కోదాడ కి సంబంధించిన నిరుపేద కుటుంబానికి చెందిన ఎంతో మంది విద్యార్థులకు రఘు అన్న ఉచిత కోచింగ్ లో అవకాశం ఇచ్చి మా జీవితాలలో వెలుగులు నింపారని – తల్లి దండ్రుల ప్రత్యేక ఆశీర్వాదాలు తెలిపారు. ఓటు కోసం కాదు, విద్యార్థుల భవిషత్తు కోసం వచ్చా అనడానికి నిలువెత్తు నిదర్శనం ఎస్ ఐ, కానిస్టేబుల్ జాబ్ లు సాధించిన విద్యార్థులని, కోచింగ్ సమయంలో మాకు అని విధాలుగా అందుబాటులో ఉంటూ మాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకొని కోచింగ్ మొదటి రోజు నుండి ఈ రోజు వరకు మా విజయంలో కీలకపాత్ర పోషించి కోచింగ్ ఇంఛార్జి శివారెడ్డి అన్నకి ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు.

## ప్రధాన పార్టీ నుండి పిల్లుట్ల రఘుకు టికెట్

• కుక్కల వెంకన్న

**టి మీడియా, అక్టోబర్ 5, హుజూర్ నగర్ :**



సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణ కేంద్రంలోనీ ఓజో ఫౌండేషన్ కార్యలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇంచార్జ్ కుక్కల వెంకన్న మాట్లాడుతూ.. ఏ ఒక్కరు కూడా పార్టీలు మారవద్దని పిల్లుట్ల రఘు అన్నకు త్వరలో ప్రధాన పార్టీ నుండి టికెట్ రాబోతుందని, సర్వేలన్నీ పిల్లుట్ల రఘువైపే ఉన్నాయని, కొంతమంది పార్టీ టికెట్ కన్ఫర్మ్ అయినట్టు పార్టీ కండువాలు కప్పి, ప్రజలనూ మభ్యే పెట్టి, మళ్ళీ కాలం వెళ్ళబుచ్చే చర్యలకు పాల్పడుతున్నారని, గడిచిన కాలంలో వారు గెలిచి నియోజవర్గ ప్రజలకు చేసిన పనులు శూన్యమని, మళ్లీ ప్రజలను పిచ్చోళ్ళని చేసి మేమే గెలుస్తాం అని, ప్రజలను మోసం చేయడానికి రెడీగా ఉన్నారని,. నియోజకవర్గ ప్రజల్లో మార్పు రావాలి. ఆ మార్పు పిల్లుట్ల రఘు అన్న గెలుపుతోనే సాధ్యం కావాలి. అధికారం లేకుండనే ఇన్ని మంచి పనులు చేస్తున్నాడు. పిల్లుట్ల రఘు, ఎమ్మెల్యేగా ఉంటే ఇంకా ఎన్ని గొప్ప పనులు చేస్తాడు అని ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇంచార్జ్ కుక్కల వెంకన్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ ముఖ్య నాయకులు కార్యకర్తలు, రఘు అన్న అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# సిక్కిం వరదలు...14 మంది మృతి

- 102 మంది గల్లంతు



**టీ మీడియా, అక్టోబర్ 5,గ్యాంగ్‌టక్ :**
మెరుపు వరదలతో సిక్కిం అతలాకుతలమైంది. ఉత్తర సిక్కింలోని లోనాక్ సరస్సు ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కుంభవృష్టి కురవడంతో .. లోచెన్ లోయలోని తీస్తా నదికి భారీగా వరదలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు 14 మంది మరణించగా, 102 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో 23 మంది ఆర్మీ సిబ్బంది కూడా ఉన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఇప్పటి వరకు 26 మంది గాయపడ్డారు. 2,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 11 వంతెనలు కొట్టుకుపోయాయని, 22,000 మందికి పైగా ప్రజలు ప్రభావితమయ్యారని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఆర్మీ మరియు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్ఎఫ్) నేతత్వంలో ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నారు. భారత వైమానిక దళం కూడా సిద్ధంగా ఉందని అన్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 3,000 మంది పర్యాటకులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయినట్లు సిక్కిం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విబి పాఠక్ తెలిపారు. చుంగ్‌థాంగ్‌లోని తీస్తా స్టేజ్ 111 ఆనకట్టలో పనిచేస్తున్న పలువురు కార్మికులు కూడా ఆనకట్ట సొరంగాల్లోనే చిక్కుకుపోయినట్లు పేర్కొన్నారు. ఆకస్మిక వరదలతో తీస్తా నది బేసిన్‌లోని దిక్చు, సింగ్తమ్, రంగ్పో పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రహదారులు నీటమునిగాయి. పశ్చిమబెంగాల్, సిక్కింను కలిపే 10వ నంబర్ జాతీయ రహదారి చాలా చోట్ల దెబ్బతింది. వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. తీస్తా సిక్కిం నుండి బెంగాల్‌కు దిగువకు ప్రవహిస్తున్నందున రాష్ట్ర సరిహద్దు సమీపంలోని ఇళ్లలోకి బురద చేరింది. బెంగాల్ లోని కాలింపాంగ్ జిల్లాలో పలు చెట్లు నేల కూలాయి. నివాసాలు కొట్టుకుపోయాయి.

# దసరా పండుగ వేళ

- ప్రయాణికుల కోసం 5,500 ప్రత్యేక సర్వీసులు
- కీలక ప్రకటన చేసిన ఏపీఎస్ఆర్టీసీ



**టి మీడియా, అక్టోబర్ 5,అమరావతి :**
దసరా పండుగ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా కర్నాటకలోని స్వగ్రామాలకు వెళ్లే లు సిద్ధంచేస్తున్నారు. ఈ నెల 13 నుండి 26 వరకు.. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను ఏపీఎస్ ఆర్టీసీ యాజమాన్యం నడపనుండి. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ కీలక ప్రకటన చేసింది.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దసరా రద్దీని దష్టిలో పెట్టుకుని 5,500 ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 13 నుంచి 22వ తేదీ వరకు 2,700 బస్సులు, 23 నుంచి 26 వరకు 2,800 బస్సులు నడపనున్నారు. దసరాకు ముందు హైదరాబాద్ నుంచి 2,050, బెంగళూరు నుంచి 440, చెన్నై నుంచి 153 బస్సులు ఏపీలోని వివిధ నగరాలు, పట్టణాలకు సర్వీసు అందిస్తాయి. రాష్ట్ర పరిధిలో విజయవాడ నుంచి 885 బస్సులు, విశాఖ నుంచి 480, రాజమహేంద్రవరం నుంచి 355 కలిపి మొత్తం 1,137 ప్రత్యేక బస్సులను వివిధ జిల్లాలకు నడుపుతారు. వీటిలో సాధారణ ఛార్జీలే ఉంటాయని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. రాకపోకలకు కలిపి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ కూడా లభిస్తుందని పేర్కొంది. చిల్లర సమస్య లేకుండా యూటీఎస్ యంత్రాల ద్వారా ప్రయాణికులు ఫోన్‌పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్ స్కానింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులు ఉపయోగించి టికెట్లు కొనుగోలు చేయవచ్చని తెలిపింది. ఈ నెల 22న దుర్గాష్టమి.. 23 నవమి, దశమి రోజుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా ఉంటుంది. ఏపీలోని ఇతర ప్రాంతాలకు విజయవాడ నుంచి తిరిగే అన్ని సర్వీసులను యధావిధిగా నడపనున్నారు. తెలంగాణ, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు పెద్ద ఎత్తున ప్రయాణికులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆర్టీసీ సాధారణ రోజుల్లో నడిపే బస్సులతో పాటు పండుగ రోజుల్లో ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. చెన్నై , హైదరాబాద్, బెంగుళూరు పొరుగు రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ముఖ్య ప్రాంతాలకు కూడా అదనంగా ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. విజయవాడ , రాజమహేంద్రవరం విశాఖ , కర్నూలు, చైన్నై , బెంగుళూరు, తిరుపతి, అనంతపురం, విజయనగరం, కాకినాడ, భీమవరం, అమలాపురం, కడప, భద్రాచలం, శ్రీశైలం, మార్కాపురం, ఒంగోలు, తుని, శ్రీకాకుళం, నెల్లూరు ప్రాంతాలకు కలిపి 5,550 ప్రత్యేక బస్సులు నడుపనుంది.

**సాధారణ ఛార్జీలే..**
ప్రయాణికులపై పండుగ రోజుల్లో భారం పడకూడదని గత రెండేళ్లుగా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది కూడా ఇదే విధంగా నడిపేందుకు సిద్ధమయ్యారు. తద్వారా ప్రయాణికులకు ఆర్థిక వెసులుబాటు కలిపించారు. మరోవైపు ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌కు అధికారులు అవకాశం కల్పించారు. రాను, పోను ముందస్తు రిజర్వేషన్ చేయించుకునే ప్రయాణికులకు ఛార్జీలో 10శాతం రాయితీని ఆర్టీసీ కల్పించింది. ఏటీబీ ఏజెంట్లు, ఆర్టీసీ యాప్, ఆన్‌లైన్ విధానంలో ఈ వెసులుబాటు పొందచ్చని అధికారులు తెలిపారు. రద్దీగా ఉన్న రోజుల్లో ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బందులు పడకుండా అధికారులు, సూపర్ వైజర్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రత్యేక బస్సులు పర్యవేక్షణకు జిల్లా ముఖ్య కేంద్రాలు, హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో అధికారులు, సూపర్ వైజర్లు, సెక్యూరిటీ, సిబ్బంది విధులు నిర్వహిచనున్నారు. అన్ని బస్సులకు జీపీఎస్ ట్రాకింగ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటల సమాచారం అందించేందుకు, ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కాల్ సెంటర్ 149తో పాటు 0866-2570005 ఫోన్‌ను అందుబాటులో ఉంచనున్నారు.

# ముఖ్యమంత్రి అల్పాహార పథకం మెనూ ఖరారు

## నేడు ప్రారంభం



**టి మీడియా, అక్టోబర్ 5, హైదరాబాద్ :**
ప్రజా సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన కేసీఆర్ సర్కారు మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్త ముఖ్యమంత్రి మరో చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. దసరా కానుకగా, అక్టోబర్ 6వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని తరగతుల విద్యార్థులకు 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' ప్రారంభం కానుంది. ఈ మేరకు సీఎం బ్రేక్ ఫాస్ట్ మెనూ ఖరారైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాల జడ్పీహెచ్ఎస్‌లో ఈ పథకాన్ని శుక్రవారం ఉదయం 8:45 గంటలకు ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27,147 పాఠశాలల్లో 23 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారు. పాఠశాల ప్రారంభానికి 45 నిమిషాల ముందే అల్పాహారం అందివ్వనున్నారు.

**అల్పాహారం మెనూ ఇదే..**
సోమవారం : ఇడ్లీ సాంబార్ లేదా గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ
మంగళవారం : పూరి, ఆలు కుర్మ లేదా టమాటా బాత్ విత్ రవ్వ, చట్నీ
బుధవారం : ఉప్మా, సాంబార్ లేదా కిచిడి, చట్నీ
గురువారం : మిల్లెట్ ఇడ్లీ, సాంబార్ లేదా పొంగల్, సాంబార్
శుక్రవారం : ఉగ్గాని/ పోహా/మిల్లెట్ ఇడ్లీ, చట్నీ లేదా గోధుమ రవ్వ కిచిడీ, చట్నీ
శనివారం : పొంగల్/సాంబార్ లేదా వెజిటబుల్ పొలావ్, రైతా/ఆలు కుర్మ

**ప్రైమరీ స్కూల్ టైమింగ్స్..**
ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు ప్రైమరీ స్కూల్స్ పని చేస్తాయి.
బ్రేక్ ఫాస్ట్ టైమింగ్స్ - ఉదయం 8:45 గంటల నుంచి
ప్రార్థనా సమయం - 9:35 నుంచి 9:45 వరకు

**అప్పర్ ప్రైమరీ, హై స్కూల్ స్కూల్ టైమింగ్స్..**
ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు ప్రైమరీ స్కూల్స్ పని చేస్తాయి.
బ్రేక్ ఫాస్ట్ టైమింగ్స్ - ఉదయం 8:45 గంటల నుంచి
ప్రార్థనా సమయం - 9:35 నుంచి 9:45 వరకు

# విద్యుత్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

- జాన్సన్ నాయక్



**టీ మీడియా, అక్టోబర్ 5, జన్నారం:**
విద్యుత్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఖానాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర గత నెల రోజులుగా నిరావధిక దీక్ష నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమా చారిని గురువారం రోజున సాయంత్రం ఖానాపూర్ నియోజవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ కలిసి 132 కెవి సబ్ స్టేషన్ విషయం గురించి మాట్లాడి త్వరగతుని మండల కేంద్రంలో విద్యుత్ సమస్యను తలెత్తకుండా చూస్తానని మీరు దీక్ష విరమింపజేయాలని కోరగా దానికి అంగీకారం తెలుపగా భూమాజారికి పండ్ల రసంతో దీక్ష విరమింప చేశారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ త్వరలోనే 132 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కషిచేసి మండల వాసుల విద్యుత్ సమస్యను తీరుస్తామని హామీ ఇచ్చారు. దీనితో ఏకీభవించిన సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి దీక్ష విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ కోసం ప్రతిపాదనలు



**టి మీడియా, అక్టోబర్ 5,ఆదోనిరూరల్ (కర్నూలు) :**
లోపాలు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు అన్ని రాజకయపార్టీలు సహకరించాలని ఆదోని నియోజకవర్గ అధికారి, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఓటరు జాబితపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాను ప్రక్షాళన రాజకీయ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. ప్రస్తుతం ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ స్టేషన్లు ఉండగా వాటిలో 24 పోలింగ్ స్టేషన్లకు సదుపాయాలు సరిగా లేనందువలన కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. 24 పోలింగ్ స్టేషన్లకు లొకేషన్ మార్పుకు, ప్రతిపాదన సిద్ధం చేస్తున్నామన్నారు. పోలింగ్ స్టేషన్ల మార్పుకు సంబంధించి ఏవైనా సూచనలు ఉంటే తెలియ చేయవచ్చని, వాటిని ఈఆర్వోలు పరిశీలించి తగిన నివేదికలు ఇస్తారని సబ్ కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.. పోలింగ్ స్టేషన్లు సాధ్యమైనంత వరకు ప్రభుత్వ భవనాల్లో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో ర్యాంప్, టాయ్లెట్ విత్ రన్నింగ్ వాటర్, కరెంట్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబం సభ్యు లదరూ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని సబ్ కలెక్టర్ వివరించారు.

## వైద్యవ్యవస్థలో విప్లవం సృష్టించిన తెలంగాణ

- మంత్రి హరీశ్ రావు



**టీ మీడియా, అక్టోబర్ 5, సిద్దిపేట:**
వైద్య వ్యవస్థలో తెలంగాణ ప్రభుత్వం ఒక విప్లవం సృష్టించిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఒకప్పుడు డబ్బులు ఉన్నవాళ్లే డాక్టర్లు అయ్యేవారని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతులు, కూలీల పిల్లలు కూడా వైద్యులు అవుతున్నారని చెప్పారు. సిద్దిపేటలో నిర్మించిన వెయ్యి పడకల ప్రభుత్వ దవాఖానను మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గాంధీ, ఉస్మానియా హాస్పిటళ్లలో ఉన్న సేవలు సిద్దిపేటలోనూ అందుబాటులోకి వచ్చాయన్నారు. గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలు సిద్దిపేటలోనే చేసుకోవచ్చని చెప్పారు. రూ.15 కోట్లతో క్యాన్సర్ బ్లాక్‌కు శంకుస్థాపన చేశామన్నారు. దవాఖానలో 15 ఆపరేషన్ థియేటర్లు న్నాయని చెప్పారు. నాలుగో ఫ్లోర్‌లో 100 ఐసీయూ బెడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. 30 ఎమర్జెన్సీ బెడ్స్ ఉన్నాయన్నారు. ఇకపై వైద్య సేవలకు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. సిద్దిపేటలో డయాలసిస్ బెడ్లు 40 పెంచుతున్నామని వెల్లడించారు. రూ.23 కోట్లతో సూపర్ స్పెషాలిటీ క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. అన్నిరకాల వ్యాధులకు సిద్దిపేటలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. స్టాఫ్ నర్సులను నర్సింగ్ ఆఫీసర్ అని పిలిచేలా జీవో ఇచ్చామని వెల్లడించారు.

## చంద్రబాబు కస్టడీని పొడిగించండి : సీఐడీ



**టీ మీడియా, అక్టోబర్ 5, విజయవాడ :**
స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్, సీఐడీ కస్టడీ పిటిషన్ల మీద గురువారం ఏసీబీ కోర్టులో వాదనలు జరిగాయి. అరెస్ట్ అయిన టీడీపీ అధినేత చంద్రబాబు రిమాండ్ నేటితో ముగుస్తున్న తరుణంలో కోర్టు ఆదేశాలు కీలకం కానున్నాయి. వర్చువల్ విధానంలో చంద్రబాబుని ఏసీబీ జడ్జి ముందు ప్రవేశపెట్టగా, చంద్రబాబు రిమాండ్ పొడిగించాలని కోరుతూ సీఐడీ పిటిషన్ వేసింది. కాగా, సాంకేతికంగా చూసిన ఈ కేసులో చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేదని ప్రమోద్ కుమార్ ధూపే పేర్కొన్నారు. ఒప్పందాలలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని తెలిపారు. జరిగినా వాటితో చంద్రబాబుకు సంబంధం లేదని వెల్లడించారు. నాటి ప్రభుత్వం స్కిల్ కార్పొరేషన్ ఇచ్చిన బ్యాంకు గ్యారంటీల సంగతేంటని ఏసిబి ప్రశ్నించింది. స్కిల్ కేసులో నిధులు మళ్లింపుపై ఏసీబీ కోర్టుకు ఎఐజి పొన్నవోలు కొన్ని డాక్యుమెంట్లు సమర్పించారు. స్కిల్ డెవలప్మెంట్ నిధులు 27 కోట్లు మళ్ళినట్లు ఆయన తెలిపారు. టిడిపి బ్యాంక్ ఖాతా వివరాలను ఎసిబి కోర్టుకు అందజేశారు. దీనికి సంబంధించిన టిడిపి ఆడిటర్ను ప్రశ్నిస్తామని ఏఏజీ తెలిపారు. ఈ నెల 10న విచారణకు ఆడిటర్ హాజరు కానున్నారని తెలిపారు. కొన్ని బ్యాంకు లావాదేవీలపై చంద్రబాబును ఇంకా విచారించాల్సి ఉందని ఆయన కోరారు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ చంద్రబాబుకు అప్లై అవుతుందని ఆయన తెలిపారు. మరిన్ని విషయాలను తెలుసుకునేందుకు చంద్రబాబును విచారించాల్సిందని పొన్నవోలు కోర్టుకు తెలిపారు.

## మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తతలు

- రెండు ఇళ్ళు దగ్ధం



**టీ మీడియా, అక్టోబర్ 5, ఇంఫాల్ :**
ఉద్రిక్తతలతో మణిపూర్ అట్టుడుకుతోంది. తాజాగా గురువారం రాష్ట్ర రాజధాని ఇంఫాల్ పశ్చిమ జిల్లాలో హింస చెలరేగింది. సుమారు రెండు ఇళ్లకు నిప్పు పెట్టగా, పలు రౌండ్లు కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి 10 గంటల సమయంలో పట్సోయ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూకెయిథెల్‌మన్బిలో ఈ ఘటన జరిగిందని అన్నారు. దాడి అనంతరం నిందితులు ఆ ప్రాంతం నుండి పారిపోయారని చెప్పారు. భద్రతా బలగాలు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ చేరిన మొయితీ మహిళా బందం భద్రతా దళాలను అడ్డుకున్నాయని చెప్పారు. ఆ ప్రాంతంలో అదనపు బలగాలను మోహరించామని అన్నారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**టి మీడియా, అక్టోబర్ 5, హుజూర్ నగర్ రూరల్ :**
హనుమంతుల గూడెం నుండి చెన్నాయిపాలెం వెళ్లే రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి డిఎంఎఫ్ నిధులనుండి 63.00 లక్షల రూపాయలు శాంక్షన్ అయిన బ్రిడ్జి నిర్మాణానికి గురువారం హుజూర్ నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి శంకుస్థాపన చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో హనుమంతుల గూడెం సర్పంచి బారెడ్డి రజిత సీతారామ రెడ్డితో,పాటు సీనియర్ నాయకులు గుండా బ్రహ్మ రెడ్డి , ఎంపీపీ మూడవ పార్వతి కొండా నాయక్ , జెడ్పిటిసి జగన్ నాయక్ , ఇరుగు పిచ్చయ్య మండల పార్టీ అధ్యక్షులు, కొలహలం కృష్ణంరాజు, సర్పంచ్ కోలాహలం లక్ష్మీ నరసింహ రాజు, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు, లక్ష్మణ రాజు, బిఆర్ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నాగార్జున పాల డైరీ వారి ఆర్థిక సహాయం



**టీ మీడియా, అక్టోబర్ 5, బెల్లంపల్లి :**
హుజురాబాద్ నాగార్జున మిల్క్ ప్రొడక్ట్స్ డైరీ ద్వారా బెల్లంపల్లి బస్టాండ్ ఏరియాలో 13 సంవత్సరాల నుండి నాగార్జున పాలు, పాల పదార్థములను, వినియోగదారులకు అందుబాటులో ఉంచుతూ,సంస్థకు సేవలు అందిస్తూ కొద్ది రోజుల క్రితం ఆర్.రవీందర్ అకాల మరణం చెందరు.అయితే వారి కుటుంబానికి డైరీ వారు ఆర్థిక సాయం అందించారు.యాజమాన్యం మేనేజింగ్ డైరెక్టర్,పుల్లూరి ప్రభాకర్ రావు మాట్లాడుతూ...డైరీలో పనిచేసే యాజమాన్యం, వ్యక్తులందరూ కూడా నాగార్జున కుటుంబ సభ్యులుగా భావిస్తూ, చనిపోయిన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆర్థిక సాయంగా 1,00000 రూపాయలను డైరీ నుండి అందించడం జరిగింది. అంతేకాకుండా డైరీ నుండి అనేక సంక్షేమ,సేవా కార్యక్రమాలు అందించడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కృష్ణ ప్రసాద్,ఏజీఎం పాల్గొన్నారు.

## బాలికల జూనియర్ కళాశాల నూతన భవనం ప్రారంభోత్సవం

- పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



**టి మీడియా, అక్టోబర్ 5, హుజూర్ నగర్/ పాలకీడు :**
హుజుర్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పాలకీడు మండల కేంద్రంలో రూ.3.50 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల అదనపు తరగతి గదుల నిర్మాణం నూతన భవనం ప్రారంభోత్సవం గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసారు. తర్వాత కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొని కళ్యాణ లక్ష్మీ/ షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకమైన పథకాలతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. అన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలను తలదన్నేలా , ప్రభుత్వ విద్యాసంస్థల్లో, గురుకులాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, పౌష్టిక ఆహారం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. గురుకుల హాస్టల్లలో చదువుకునే విద్యార్థులకు మరింత నాణ్యమైన భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. తొమ్మిదేళ్ల సుపరిపాలన..కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రాభివద్ధి.. సబ్బండవర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ.. దేశానికే తెలంగాణను రోల్‌మోడల్‌గా కేసిఆర్ తీర్చిదిద్దారని అన్నారు.

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**టి మీడియా, అక్టోబర్ 5, ముంబాయి:**
దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఈరోజు మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. కొన్ని సెషన్లుగా ప్రాఫిట్ బుకింగ్ చేసిన ఇన్వెస్టర్లు ఈరోజు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 406 పాయింట్లు లాభపడి 65,632కి ఎగబాకింది. నిఫ్టీ 110 పాయింట్లు పెరిగి 19,546 వద్ద స్థిరపడింది.

## కౌన్సిల్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు నిరసన




**టి మీడియా, అక్టోబర్ 5,ఏలేశ్వరం(కాకినాడ) :**
కోర్టులో పిటిషన్లకు రూపాయి స్థానంలో 20 రూపాయలు స్టాంపు వేయాలని బార్ కౌన్సిల్ తీసుకున్న ఏకగ్రీవ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రత్తిపాడు కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ప్రతిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ.. కోర్టులో రోజు వందల సంఖ్యలో న్యాయవాదులు తమ కక్షిదారుల తరఫున పిటిషన్లు దాఖలు చేస్తారన్నారు. పిటిషన్‌లపై ఈనెల ఐదు నుండి రూపాయి స్టాంపుకు బదులు 20 రూపాయలు స్టాంపులు అతికించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులు జారీ చేయడం దురదష్టకరమన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ తీర్మానం కక్షిదారులను, న్యాయవాదులను ఇబ్బంది ఆర్థికంగా ఇబ్బంది పెట్టే విధంగా ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో వకాలత్ పై అతికించే వెల్ఫేర్ స్టాంపు 30 రూపాయలు ఉండగా, మన రాష్ట్రంలో 100 రూపాయలు ఉందన్నారు. బార్ అసోసియేషన్ల ఆమోదం లేకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు చలంకూరి రామకష్ణ, కార్యదర్శి బి.మధుబాబు, న్యాయవాదులు ఆర్ వెంకట్రావు, బి.చలం, రాయి శ్రీనివాసరావు, రాజాల చిట్టిబాబు, బండారు నరసింహారావు, కంద నానాజీ, కిలపర్తి శ్రీనివాస్, ఆర్ వెంకట్రెడ్డి, గెడ్డం కామేష్, పదివేల నాగేంద్ర, అశోక్, మంజూష, ప్రసన్న ఉన్నారు.

## పార్టీలకు అతీతంగా డబుల్ ఇండ్ల పంపిణీ

- మంత్రి తలసాని



**టీ మీడియా, అక్టోబర్ 5, మేడ్చల్:**
పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. పార్టీలకు అతీతంగా ఇండ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా కొర్రెములలో 720 మంది లబ్ధిదారులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రూ.10 వేల కోట్ల వ్యయంతో లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లను నిర్మించామన్నారు. అంతకుముందు సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో 200 మంది లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను మంత్రి తలసాని అందజేశారు. కులవత్తుల వారికి అండగా నిలుస్తున్న బీసీ బంధు ఇస్తున్న ఒకేఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ అని చెప్పారు. బీసీలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్న కేసీఆర్ సర్కార్‌కు మద్దతు పలకాలని కోరారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మండలి చైర్మన్

- గుత్తా సుఖేందర్‌రెడ్డి



**టీ మీడియా, అక్టోబర్ 5, నల్లగొండ :**
జిల్లాలోని మిర్యాలగూడ నియోజకవర్గం మాడ్గులపల్లి మండలం పరిధిలో పంచాయత్ రాజ్ శాఖ నిధులు 60 లక్షల రూపాయలతో కుక్కడం గ్రామం నుంచి పూసలపహాడ్ గ్రామం వరకు 3.8 కిలోమీటర్ల మేర నూతన రోడ్ నిర్మాణ పనులకు గురువారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్థానిక శాసన సభ్యుడు నల్లమోతు భాస్కర్ రావుతో కలిసి శంకుస్థాపన చేసారు. అనంతరం గ్రామ సర్పంచ్ అలుగుబెల్లి గోవింద్ రెడ్డి అధ్వర్యంలో 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భాస్కర్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుక్కడం గ్రామానికి అనేక నిధులు కేటాయించి అభివద్ధి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులయ్యే బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోకల శ్రీవిద్య రాజు, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మోసిన్ అలీ, మండల పార్టీ అధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, పాక్స్ చైర్మన్ జెర్రిపోతుల రాములు గౌడ్, మాజీ ఎంపీటీసీ పుట్ట పద్మ, గుడే సత్యనారాయణ శర్మ, రాబర్ట్, మస్తాన్, రామస్వామి, శ్రీను, సోమయ్య, జానయ్య, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ, తమిళనాడులలో ఐటి సోదాలు



**టీ మీడియా, అక్టోబర్ 5,హైదరాబాద్ :**
హైదరాబాద్ లో అదాయపు పన్ను శాఖ అధికారులు పలు చిట్స్ కంపెనీలలో సోదాలు నిర్వహిస్తున్నారు. చిట్ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ సంస్థలు లక్ష్యంగా ఐటి సోదాలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం నుండి 100 బందాలు హైదరాబాదులో పలుచోట్ల ఐటీ సోదాలు చేపడుతున్నాయి. శంషాబాద్, అమీర్పేట, కూకట్పల్లి, జూబ్లీహిల్స్ తో పాటు పలు ప్రాంతాల్లో ఐటి అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆదాయపను చెల్లింపులు పెద్ద మొత్తంలో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపణలతో వ్యాపారవేత్తలు ప్రసాద్, రఘువీర్, కోటేశ్వరరావు ఇళ్లతో పాటు వారి కంపెనీల్లో కూడా సోదాలు చేస్తున్నట్లు సమాచారం. ఇంత భారీ స్థాయిలో ఐటీ దాడులు జరగడం చర్చనీయాంశంగా మారింది. వీటితో పాటు తమిళనాడులో డీఎంకే ఎంపీ జగద్రక్షణ్ నివాసంలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. చెన్నై, వేలూరు, అరక్కోణం, కోయంబత్తూరులోని జగద్రక్షణ్‌కు చెందిన కార్యాలయాలు, నివాసాల్లో ఐటీ శాఖ తనిఖీలు చేపట్టింది. దాదాపు 150 మంది ఐటీ సిబ్బంది ఏకకాలంలో 70 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.